28న కంకిపాడులో సామాజిక బస్సు యాత్ర

ఉయ్యూరు: కంకిపాడులో ఈనెల 28న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని బోళ్ల పాడు, ముదునూరు, కలవపాముల గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పార్థసారథి విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో బస్సు యాత్ర విజయవంతంపై సమావేశం నిర్వహించారు. బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తరలిరావాలని కోరారు. అనంతరం దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి పంట నష్టం సర్వేపై అధికారులకు సూచనలు చేశారు. ముదునూరులో ఇటీవల వరి కుప్ప దగ్ధమైన ఘటనలో రైతు శివప్రసాద్‌ను పరామర్శించి కుప్ప తగులపెట్టిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించారు. గత సీజన్‌లో ఆఫ్‌లైన్‌లో ధాన్యం సరఫరా చేసిన 112 మంది రైతులకు రూ 2.50 లక్షల నగదును అందించారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలిన రైతులు బస్తాకు రూ.50 నష్టపోయామని చెప్పటంతో ఎమ్మెల్యే ప్రతి రైతుకూ తన సొంత డబ్బులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, మొవ్వా నాగలక్ష్మి, పొనుగుమాటి బాలస్వామి, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాసే రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా నిలుస్తాం

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. శిబిరాన్ని ఎమ్మెల్యే పార్థసారథి సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, ఎంపీడీఓ పి.అనూష, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ముదునూరులో రైతులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

రైతాంగాన్ని ఆదుకోవాలి

కంకిపాడు: తుపానుతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కేంద్ర ప్రతినిధి బృందానికి విన్నవించారు. జాతీయ విపత్తు నిర్వహణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ నేతృత్వంలోని కేంద్ర బృందం బుధవారం కంకిపాడు, దావులూరు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా రైతు మసిముక్కు సాంబశివరావు పొలం వద్ద నీట మునిగిన వరి దుబ్బులను పరిశీలించారు. రైతుతో కేంద్రబృందం మాట్లాడి వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు నేలవాలిపోయాయన్నారు. కోత కోసిన పనలు కూడా నీటిలో మునిగిపోయి మొలక వచ్చిందన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి ఉదారంతో ముందుకు రావాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో మురుగు పారుదల కాక సమస్య జటిలం అవుతోందన్నారు. డ్రెయిన్ల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జెడ్పీటీసీ బాకీ బాబు, పలువురు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


కేంద్ర బృంద ప్రతినిధి రాజేంద్ర రత్నూకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పేదలకు బాసటగా జగనన్న ప్రభుత్వం

నున్న(విజయవాడరూరల్): ప్రతి పేదవాడు ఆనందంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. నున్న గ్రామంలో మూడవ నంబరు సచివాలయం వద్ద బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తొలుత సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు, అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల్లో నున్న గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో 112 కోట్ల రూపాయల డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం రంగారావు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు, కన్వీనర్లతో వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని సూచించారు. సొసైటీ చైర్మన్ గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్, కన్వీనర్లు, గృహసారథులు తగరం రవీంద్ర, జూనపూడి కృష్ణ, కాటూరి నాగరాజు, గద్దం సుధాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయ కార్యదర్శులు వరుణ్, అజేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కె.సువర్ణరాజు


సావరగూడెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు

సావరగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

గన్నవరంరూరల్: మండలంలోని సావరగూడెం గ్రామంలో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ప్రశంసలు పొందాయన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలను కంటికి రెప్పలా కాపాడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జా విష్ణువర్ధనరావు, రాచమళ్ల యల్లారావు, సచివాలయం, బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు.

యనమలకుదురులో కార్తిక మాస ఉద్వాసన పూజలు


యనమలకుదురు ఆలయంలో స్వామివారి అలంకరణ


భక్తులకు శేష వస్త్రాలు అందజేస్తున్న ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం కార్తికమాసం ఉద్వాసన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలో స్వామివారికి అభిషేకం చేసిన 2050 మంది భక్తులకు ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు ప్రసాదం, శేషవస్త్రాలు, దేవస్థానం క్యాలెండర్ అందజేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులో కార్తిక మాస వన సమారాధన బుధవారం ఉత్సాహంగా జరిగింది. పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో 1947 ఐఎస్‌సీ ఫ్యాక్టరీ కార్మికులకు కార్తిక మాస వన సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు. మహిళలు, చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తొలుత కార్తిక మాస వన సమారాధనలో హిందూ సంప్రదాయం ప్రకారం తొలుత మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 1200 మంది కార్మికులకు వన సమారాధన నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం స్వామి, లయన్స్ క్లబ్ సభ్యులు తాడి రంగారావు, అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, అట్లూరి శ్రీనివాసరావు, వేగిరెడ్డి నాని పాల్గొన్నారు.

పోయిరావమ్మా..పోలి..పోయిరావమ్మా!


మద్దూరు ఏటిపాయ వద్ద శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


మద్దూరు ఏటిపాయ ఒడ్డున దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

కార్తిక మాసం ఆఖరి రోజు కావటంతో బుధవారం భక్తులు ఏటిపాయలు, కాలువల వద్దకు వెళ్లి పోలిని సాగనంపారు. మండలంలోని మద్దూరు ఏటిపాయ, ఉప్పలూరు, కంకిపాడు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని కాలువల వద్దకు తెల్లవారుజామునే భక్తులు చేరుకుని ఒడ్డున దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం అరటి దొనెల్లో దీపాలను ఉంచి ఏటిపాయలు, కాలువ నీటిలో వదిలి పోలిని సాగనంపారు. మద్దూరు ఏటిపాయ వద్ద శివమందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి భక్తి పారవశ్యం చెందారు.

\- కంకిపాడు

వివాహిత అదృశ్యం

పెనమలూరు: పెనమలూరులో వివాహిత అదృశ్యం అవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ సూర్యాపేట జిల్లా మిగడంపాడు గ్రామానికి చెందిన భుక్యా శ్రీరామ్ కొద్ది సంవత్సరాల క్రితం నుంచి పెనమలూరు గ్రామం అంబేడ్కర్ కాలనీలో ఉంటున్నాడు. అతను ఆటో డ్రైవర్‌గా పని చేస్తాడు. అతని భార్య భుక్యా నీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ నెల 10వ తేదీన భార్యభర్తలు రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రపోయారు. మరల 11వ తేదీ ఉదయం లేచి చూడగా భార్య నీల కనబడలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కానూరులో బైక్ చోరీ

పెనమలూరు: కానూరులో బైక్ చోరీ జరగటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన వల్లభనేని వెంకటేష్ బోర్‌వెల్స్ పనులు చేస్తుంటాడు. అతను మంగళవారం కానూరు స్పీడ్ బార్ సమీపంలో బైక్ పార్కు చేసి పని కోసం మాట్లాడటానికి పక్క సందులోకి వెళ్లాడు. అతను కొద్ది సమయం తరువాత వచ్చి చూడగా బైక్ కనపడలేదు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

కంకిపాడు: ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీ ఎన్‌జీవో కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం అసోసియేషన్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ పశ్చిమ కృష్ణా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ పరిశీలకులుగా వ్యవహరించారు. యూనిట్ కార్యదర్శిగా పి.కృష్ణారావు, అసోసియేట్ అధ్యక్షుడుగా వి.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఓ.రామకృష్ణ, కె.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ ఉపాధ్యక్షుడు ఖాసిమ్, కార్యవర్గ ప్రతినిధులు ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగులకు నేత్ర, దంత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో ఈ నెల 15న ఉచిత కంటి, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు తమ ఐడీ కార్డులతో వైద్య శిబిరానికి రావాలని కోరారు.

క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి అన్నారు. తాడిగడపలోని కార్మికనగర్ 2 వ నంబరు సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డు, బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తాడిగడప 2వ నంబరు సచివాలయంలో ఇప్పటివరకు రూ.21 కోట్లు సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమచేసిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కార్యక్రమం కొనసాగుతుందని, అర్హులైన వారు దరఖాస్తు చేస్తే వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కటికల క్రిస్టోఫర్, ఎం.లక్ష్మి, ముచ్చు నాగేంద్రబాబు, మాణిక్యం, ఆకునూరు సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరం

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 15వ తేదీన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ ఆస్పత్రి వైద్యులతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలలో రొమ్ము, గర్భాశయంలో వచ్చే క్యాన్సర్‌కు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కేసరపల్లి, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్దవరం, బూతుమిల్లిపాడు, జక్కులనెక్కలం జగనన్న కాలనీలో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

యువతిని బెదిరించిన యువకుడిపై కేసు

పెనమలూరు: ప్రేమించానని, తనను పెళ్లి చేసుకోవాలని యువతిని బెదిరించిన యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు కామయ్యతోపునకు చెందిన వందన బ్యూటీషియన్‌గా పనిచేస్తుంది. ఆమెతో శీలం నవీన్‌కు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే నవీన్ ప్రవర్తన నచ్చకపోవటంతో ఆమె నవీన్‌కు కొంతకాలంగా దూరంగా ఉంటోంది. దీంతో నవీన్ 11వ తేదీ రాత్రి వందన ఇంటికి వచ్చి తలుపు పగులకొట్టి ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి తనను పెళ్లి చేసుకోవాలని దాడి చేశాడు. పైగా చంపుతానని బెదిరించాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నవీన్‌పై కేసు నమోదు చేశారు.

ఆడుదాం ఆంధ్రా సమర్థంగా నిర్వహించాలి

పెనమలూరు: మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించాలన్నారు. ఇప్పటికే క్రీడాసామగ్రి పంపిణీ చేశామని చెప్పారు. గ్రామాలలో యువ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు శేషగిరిరావు, కనక మహాలక్ష్మి, ఏవో లోయ శివశంకర్‌రావు, సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇందుపల్లిలో వరి పంట కోత ప్రయోగం



ఉంగుటూరు: మండలంలో ఖరీఫ్ దిగుబడులు తుఫాన్‌కు ముందు బాగున్నప్పటికీ తుఫాన్‌తో వరి దిగుబడులు తగ్గాయని, ఎకరానికి 26 బస్తాలు మాత్రమే వస్తున్నాయని గుడివాడ డివిజన్ డీవైఎస్‌వో ఎం.ఆనంద్‌కుమార్ తెలిపారు. ఇందుపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంటకోత ప్రయోగాలు జరుగుతాయని చెప్పారు. దిగుబడి, మొత్తం ఉత్పత్తి అంచనా వేయుట, దిగుబడిని బట్టి బీమా వర్తించటానికి వరి కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో దుర్గానాగేశ్వరరావు, వీఏఏ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

పెనమలూరులో చురుకుగా ఎన్యూమరేషన్

పెనమలూరు: మండల పరిధిలో పంట నష్టం వివరాలు చురుకుగా నమోదు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వచ్చిన తుపాను కారణంగా వరి పంటలతో పాటు ఆకు తోటలు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రధానంగా వరి పంట చేతికి వచ్చే సమయంలో చేజారింది. పంట నేలవాలి పంట మొత్తం నీట మునిగింది. మండల పరిధిలో దాదాపు 4 వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పంట నష్టం వివరాలు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో గ్రామాల్లో వీఏఏలు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పంటల నష్టం వివరాలు పరిశీలించి నమోదు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నాటికి పంట నష్టం నమోదు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులు పంట నష్టం వివరాలు ఎన్యూమరేషన్ చేస్తున్న సిబ్బందికి తెలపాలని ఏవో శైలజ కోరారు.


వణుకూరులో పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

బీఎల్‌ఓలు విధులు సక్రమంగా నిర్వహించాలి

ప్రత్యేక పరిశీలకుడు శ్రీధర్

పెనమలూరు: ఓటర్ల జాబితా విషయంలో బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలని ఓటర్ల జాబితా సవరణ జిల్లా ప్రత్యేక పరిశీలకుడు, ఏపీ కాలుష్య నివారణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ అన్నారు. ఆయన బుధవారం తాడిగడప, పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెనమలూరు పల్లిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల వివరాలను బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మరకు బూత్ లెవల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలతో పాటు డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లకు ఓటు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లను గతంలో వారికి ఉన్న ఓటు విషయమై తనిఖీ చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు నిబంధనల ప్రకారమే పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, తాడిగడప కమిషనర్ ప్రకాశరావు, డీటీ భవాని,రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేక పరిశీలకుడు బి.శ్రీధర్

జంక్షన్‌లో గ్రామీణ తపాలా సేవకుల సమ్మె

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామీణ తపాలా సేవకుల డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన దేశవ్యాప్త నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు బుధవారం తపాలా కార్మికులు విధులు బహిష్కరించి హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు ఎదుట ఆందోళనకు దిగారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గ్రామీణ డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, ఎనిమిది గంటల పనిభారం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు కేవీఎస్ సత్యనారాయణ, వేదనాయకం, పి.నాగేశ్వరరావు, సీహెచ్ ఈశ్వరరావు, పి.సుభాని ఖాన్, ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.


హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు ఎదుట గ్రామీణ తపాలా సేవకుల ఆందోళన

ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ


స్పోర్ట్స్ కిట్‌లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


పీఈటీలకు కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో-2

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీల కోసం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన స్పోర్ట్స్ కిట్‌లను గ్రామ సచివాలయాలకు పంపిణీ చేశారు. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. 15 ఏళ్లు నిండిన ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు క్రీడా కిట్లు

ఉంగుటూరు: యువతీ యువకులకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి చేపడుతోందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా సామగ్రిని సచివాలయాలకు బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాలకు మొత్తం 304 క్రీడా కిట్లు అందజేశారు. క్రికెట్ బ్యాట్లు 48, రాకెట్ బ్యాట్స్ 96, నైలాన్ షటిల్ బెరల్స్ 48, బ్యాడ్మింటన్ నెట్స్ 16, వాలీబాల్ 48, వాలీబాల్ నెట్స్ 16, టెన్నికాయిట్ రింగ్‌లు 32 ఆయా పంచాయతీ కార్యదర్శులకు, పీఈటీ కోచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సాంబశివరావు, పీఈటీలు పాల్గొన్నారు.

అమర గాయకుల సేవలు ఆదర్శనీయం

విజయవాడకల్చరల్: అమర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు సయ్యద్ ఆలీ అన్నారు. ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై బుధవారం అమర గాయకుడు కిషోర్‌కుమార్, మహ్మద్ రఫీ, మన్నాడే, లతా మంగేష్కర్, ఘంటసాల తదితర గాయనీ గాయకుల స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. సయ్యద్ ఆలీ మాట్లాడుతూ హిందీ చిత్రగీతాలకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువచ్చారని తెలిపారు. కళా పోషకుడు మీరాకుమార్ మాట్లాడుతూ హిందీ గాయకులను తెలుగు వారు సమాదరించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. డి.చంద్రశేఖర్, మల్లాది స్వాతి, రూపాశ్రీ , రాంబాబు తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. అనంతరం సయ్యద్ ఆలీని, గాయకుడు రాంబాబును నిర్వాహకులు సత్కరించారు.